# సకల కలా కోవిదుడు

మేనకా ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నాటక ప్రదర్శనకు వెళ్ళి నప్పుడు చూశానాయన్ని తొలిసారిగా. 'నత్తిమారాజు' పరిచయం చేసేడు. (నత్తిమారాజు అసలు పేరు నర్సింహరాజు. కొంచెం తడుము కుంటూ మాట్లాడతాడని అతనికా పేరు పెట్టుకున్నాం. చిన్నప్పుడు వచ్చీ రాని మాటల్లో "నీ పేరేంతి?'' అంటే ''నత్తిమారాజు'' అని చెప్పేవాడనుకోండి; అదే చివరికి ఖాయమైపోడం. అదొక ఐరనీగా భావించాను.)

''మీట్ మిస్టర్ రాఘవ. శెక్రటరీ ఆఫ్ నానా కళా పరిషత్!'' అన్నాడు నత్తిమారాజు.

''నానా కళా పరిషత్తేమిటి?'' అన్నాను రాఘవకి షేక్ హాండిస్తూ.

"నారాయణపురం నాటక కళా పరిషత్తుకి అది సంక్షిప్త నామం."

"బావుంది, బావుంది! అన్ని కళలకీ పరిషత్తు అన్న అర్థం కూడా కాకతాళీయంగా కుదిరింది!" అన్నాను నవ్వుతూ.

"అది కూడా నిజమేనండి" అని, తమ పరిషత్తు నాటకాలు "వేయించడం", పాట కచ్చేరీలు "చేయించడం", చిత్రకళా ప్రదర్శనలు నడిపించడం తమ విద్యుక్త ధర్మాలుగా వివరించారు రాఘవ.

"నిజానికి రాఘవ అన్న పేరే గొప్పది నా దృష్టిలో" అన్నాను. "ఎందుకంటే, ఆంధ్ర నాటక కళకు బళ్ళారి రాఘవ మూలస్తంభం లాంటివాడు కదా.... అంతేకాక, సినీ రచయితలలో సముద్రాల రాఘవా చార్యులంటే నాకెంతో గౌరవం!" అన్నాను. నానా కళా పరిషత్తులో సెక్రటరీగా వుండడానికి రాఘవకున్న యితర అర్హతలు నాకు సరిగా తెలియక.

పని వుందంటూ, రాఘవ వెళ్ళారు.

"రాఘవ అన్నది వీడి అసలు పేరు కాదు, తెలుసా? అవి పొడి అక్షరాలు!" అన్నాడు నర్సింహరాజు, చిరునవ్వుతో.

"నిరాశ, అత్యాశ, మపాసా, పికాసో- అలాగా?"

"వాళ్ళెవరు?"

"నిరాశ- అంటే నిడదవోలు రాజేశ్వరశర్మ, అత్యాశ- అంటే అనిపిండి త్యాగరాయశర్మ, మపాసా- అంటే మల్యాల పార్థసారథి, పికాసో- అంటే తెలుసుగా, పిళ్ళా కామేశ్వర సోమయాజులు!"

"కరెక్ట్! అలాగే, రాఘవ అంటే రావూరి ఘటోత్కచవర్మ!"

"చాలా అరుదైన పేరు!" అని మెచ్చుకున్నాను. అరుదైన దాన్ని దేన్నైనాసరే మెచ్చుకోడం నా కలవాటు.

ఓ వారం గడిచాక ఊళ్ళో ఏదో ఆర్ట్ ఎగ్జిబిషన్ జరుగుతుందంటే మా అమ్మాయి పోరు పడలేక తీసుకువెళ్ళాను. (మా అమ్మాయి ఇప్పుడిప్పుడే వాటర్ కలర్స్‌తో, ఆయిల్ కేక్సుతో బొమ్మలు వేస్తోంది.) అక్కడ తగిలాడు రాఘవ. "నాచి కళా పరిషత్" అని చుట్టూరా అందమైన అక్షరాలతో రౌండు బాడ్జి ధరించాడు. మధ్యలో రెండు లైన్లున్నాయి. వాటిమధ్య కార్యదర్శి, రాఘవ అని వేరే సిరాతో వుంది.

నాచి కళా పరిషత్ అనగానే ఇతను ప్రోనాచా, యాంటీనాచా అన్న విషయంలో సందేహం తీరిపోయింది. నాచి క్వెశ్చన్‌మీద లెక్చర్లివ్వడం వరకూ ఎరుగుదును. ఏకంగా నాచి కళా పరిషత్తే స్థాపిస్తారని; దానికి రాఘవ లాంటివారు "కార్య"దర్శులుగా వుండగలరని వూహించలేకపోయాను. ఇంతలోనే ఆయన నాచి కళా పరిషత్ అంటే నారాయణపురం చిత్రకళా పరిషత్తు అని వివరించి నన్ను ధన్యుణ్ణి చేశారు.

మళ్ళీ పదిరోజులు పోయాక ఊళ్ళో రచయితల సభలు జరుగుతున్నాయంటే అక్కడికి వెళ్ళాం, నేనూ మా ఆవిడానూ. అక్కడ కూడా రాఘవగారు సెక్రెటరీగా దర్శనమిచ్చారు! నానా నరక సమాజం అని పేరు గలవారు ఆ సభలను నిర్వహించారు. ఆ పేరు నా కట్టే

నచ్చలేదు. నిజమే_ "నారాయణపురం నాటక, కథా, నవలా, రచయితల సమాజం" అని విపులీకరిస్తే తెలియొచ్చు. కాని 'నరక' అనడం కొంచెం ఎబ్బెట్టుగానే తోచింది. "మీ రామాట అంటే ధర్మరాజుగారి లాంటి మా అధ్యక్షుల వారికి కోపం వస్తుందండీ" అన్నారు రాఘవ.

రాఘవగారి ఫేకల్టీస్ కళ్ళారా చూసి గుమ్మయిపోయాను. మా సాంఘిక సేవాసంస్థ తరపున ఆయన కొక సన్మానంచేసి దండవేసి మెమెంటో యివ్వాలని ఒక ఆన్ ది స్పాట్ డెసిషన్ తీసుకున్నాను. ప్రస్తుతం ఆయన స్పాటిలెస్ సర్వీసుకు ముచ్చటపడి ఒక గోల్డ్‌స్పాట్ కొట్టించాను.

సన్మానం రోజున మాట్లాడడానికి నానా కళా పరిషత్తునుంచి, నాచి కళా పరిషత్తునుంచి, నానా నరక సమాజంనుంచి అధ్యక్షులను పిలిపించాను.

నానా కళా పరిషత్తాయన మాట్లాడుతూ, రాఘవగారు మంచి హుషారుగల చిత్రకారులు, రచయిత అని ప్రస్తుతించారు.

నాచి కళా పరిషత్తు అధ్యక్షులు రాఘవగారి చురుకుతనం గూర్చి ప్రస్తావించి, ఆయన మంచి నటులు, రచయిత అన్నారు.

నానా నరక సమాజం అధ్యక్షులు రాఘవగారి నిర్వహణా సామర్థ్యాన్ని కొనియాడుతూ ఆయన మంచి చిత్రకారులూ, నటులూ అని ఉటంకించారు.

సారాంశంగా నేను గ్రహించి సభాముఖాన వ్యక్తపరచ వలసిందేమిటంటే, రాఘవగారు నటుడు కాదు; చిత్రకారుడు కాదు; రచయిత కూడా కాదు. అయితే, ఆయన అవన్నీ ఆపుదామని కలలు కంటూ ఆయా సంఘాల్లో చందాలూ, విరాళాలూ ఇచ్చి, ఇప్పించి, చేరారు; ఎదిగారు.

అంచేత ఆయనకి సకల "కలా" కోవిదుడు అని బిరుద ప్రదానం చెయ్యవలసొచ్చింది.

(30-9-78)